సాక్షి వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 10 । మే । 2024



వైభవం.. చందనోత్సవం

పుష్పగిరిలోని కొండపై వెలసిన లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో మూల విరాట్‌కు గురువారం చందనోత్సవం వైభవంగా నిర్వహించారు. -8లో



వైఎస్సార్‌సీపీలోకి వలసలు

కమలాపురం పట్టణంలోని 11వ కౌన్సిల్ వార్డులో యోగీశ్వర్, ఆరిఫ్ బాషా, అల్తాఫ్, మహ్మద్, జాకీర్ తదితర 15 మంది యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
39.4/26.4

వాతావరణం

జిల్లాలో గురువారం 26.4 - 39.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

జన తరంగం..రాజంపేటలో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల ప్రచార సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



కదనోత్సాహం!

సార్వత్రిక సమరానికి మరో మూడు రోజులు మాత్రమే గడువు మిగిలి ఉంది. ప్రచార పర్వంలో వైఎస్సార్‌సీపీ దూసుకుపోతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజంపేటలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు జనం హోరెత్తారు. ఎటు చూసినా జన ప్రభంజనం కనిపించింది. వైఎస్సార్‌సీపీ అధినేత ప్రసంగం ఆ పార్టీ శ్రేణుల్లో కదనోత్సాహాన్ని నింపింది. రాజంపేటను అభివృద్ధి పథాన నడిపించేందుకు ఎంపీగా పి.వి.మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా ఆకేపాటి అమరనాథ్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్ జగన్ చేసిన అభ్యర్థనకు ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది.



ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మిథున్‌రెడ్డి, ఆకేపాటి

- రాజంపేటలో వైఎస్ జగన్ బహిరంగ సభ దిగ్విజయం
- భానుడి సెగను సైతం లెక్కచేయని జనం
- చంటి బిడ్డలతో సహా తరలివచ్చిన మహిళలు
- కార్యకర్తల్లో కదనోత్సాహం నింపిన వైఎస్ జగన్ ప్రసంగం

రాజంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం రాజంపేటలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు జనం హోరెత్తారు. దారులన్నీ జననేత వైపే అన్నట్లుగా వైఎస్సార్ సర్కిల్‌లో ఇసుక వేస్తే రాలనంత జనసంద్రం కనిపించింది. 20వేల మందికిపైగా జనంతో జగనన్న సభ దద్దరిల్లిపోయింది. చంటిబిడ్డలతో సహా మహిళలు సభకు రావడం, భానుడి ప్రతాపాన్ని సైతం లెక్క చేయకుండా వైఎస్ జగన్ ప్రసంగం ఆసక్తిగా వినడం విశేషం. రాజంపేటలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ఎన్నికల ప్రచార సభకు మహిళలు, యువతీ, యువకులు అధికంగా హాజరయ్యారు. సభ సూపర్ సక్సెస్ కావడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో కదన కుతూహలం కనిపిస్తోంది. ఈ సభలో సీఎంతో పాటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి పీవీ మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసుల రెడ్డి, ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సోదరుడు ఆకేపాటి అనిల్‌రెడ్డి, పార్లమెంటరీ నేత గంటా నరహరి, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీలపై జనం హర్షం

రాజంపేట ఎంపీ అభ్యర్థి పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి అమరన్న ఇద్దరూ కలిసి ఒకే వత్తిడి నా మీద తీసుకొస్తున్నారు. ఈ ప్రాంతంలో ఒక మెడికల్ కాలేజిని మంజూరు చేయించండని. నేను ఇవ్వాళ చెబుతున్నాను. రాజంపేట కోసం వచ్చే టర్మ్‌లో అది కూడా చేయిస్తానని చెప్పగానే సభలో చప్పట్లు మార్మోగాయి. ఇప్పటికే రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను కడుతున్నామన్నారు. 18వ మెడికల్ కాలేజి రాజంపేటలో వస్తుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించగానే జనం నుంచి ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

చంద్రబాబు లాంటి వ్యక్తిని నమ్మొచ్చా.. రాజకీయాలు చెడిపోయాయి...

మన జిల్లాకు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు వచ్చి మూడు ప్రాంతాల్లో మీటింగులు పెట్టి రాయచోటికి వెళ్తే రాయచోటి కంటిన్యూ అవుతుందంటాడు జిల్లా హెడ్‌క్వార్టర్స్. మదనపల్లెకి పోతే మదనపల్లె జిల్లా హెడ్ క్వార్టర్స్ అంటాడు. రాజంపేటకు వస్తే రాజంపేట జిల్లా హెడ్ క్వార్టర్స్ అంటాడు. ఇలాంటి వ్యక్తిని నమ్మొచ్చా అని ప్రశ్నించారు. ఈ చెడిపోయిన రాజకీయ వ్యవస్థ మారాలి. విశ్వసనీయత అనే పదానికి అర్థం రావాలి, విలువలు అన్నమాటకు అర్థం రావాలి అన్నారు. ఈ చెడిపోయిన రాజకీయ వ్యవస్థ మారాలి అంటే మీలో ఉన్న ప్రతి ఒక్కరూ ఒక్కటి కావాలి. ఒక్కటై తోడుగా నిలబడాలని పిలుపునిచ్చారు. మీ అందరికి మంచి జరిగేటట్లు ఈ రోజు వలంటీర్లు మళ్లీ ఇంటికి రావాలన్నా, అవ్వాతాత పింఛను రూ.3వేలు మళ్లీ ఇంటికి రావాలన్నా, బటన్ నొక్కిన సొమ్ము మళ్లీ మీ ఖాతాలకే రావాలన్న, పేదవాడి భవిష్యత్తు మారాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు, వివక్షలేని పాలన జరగాలన్నా, మనపిల్లలు , మన బడులు బాగుపడాలన్నా, వ్యవసాయం, మన హాస్పిటళ్లు మెరుగుపడాన్నా మన ప్రభుత్వంతోనే తిరిగి సాధ్యమని వివరించారు.

అన్నమయ్య ప్రాజెక్టు పూర్తికావాలంటే..

రాజంపేటకు సంబంధించి పింఛా ప్రాజెక్టు దాదాపు 90శాతం పనులు ఇప్పటికే పూర్తి చేశాం. అన్నమయ్య ప్రాజెక్టు రేపు పూర్తి కావాలన్నా, గాలేరు నగరి కాలువ పనులు రైల్వేకోడూరు వరకు పూర్తి చేయాలంటే.. ఏం చేయాలి? ఏం చేయాలి? ఇవన్నీ జరగాలంటే రెండు బటన్లు ఫ్యాన్ మీద నొక్కాలి. నొక్కి 175కు 175 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీ స్థానాల్లో ఒక్కటి కూడా తగ్గేందుకు వీలు లేకుండా చూడాలి.. ఇందుకు మీరు సిద్ధమా? అని పిలుపు రాగానే జనం నుంచి విశేష స్పందన లభించింది.



వైఎస్ జగన్‌ను చూసిన ఆనందంలో..



న్యూస్‌రీల్

ఓట్లు గల్లంతు

దువ్వూరు: దువ్వూరు మండలంలోని పలు గ్రామాల్లో దాదాపు 500 ఓట్లు గల్లంతయ్యాయి. ఓటర్ల జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో జనాలు సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు సరైన సమాధానం చెప్పడంలేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని పుల్లారెడ్డిపేట, సంజీవరెడ్డిపల్లె, దువ్వూరు, బుక్కాయపల్లె, కృష్ణపల్లె, రాంసాయినగర్, కానగూడూరు గ్రామాల్లో ఓట్లు అధికంగా గల్లంతయ్యాయి. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ అలీఖాన్‌ను వివరణ కోరగా ఓట్లు గల్లంతైన విషయం తమకు తెలియదని, ప్రజలు తమ కార్యాలయానికి వచ్చి విషయం చెప్పారన్నారు. వారి ఓటర్ పత్రాలను తీసుకుని ఉన్నతాధికారులకు తెలిపి న్యాయం చేస్తామని వివరించారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్



హజ్ యాత్రికులకు వ్యాక్సిన్ వేస్తున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

కడప రూరల్: హజ్ యాత్రికులకు గురువారం స్థానిక రాధాక్రిష్ణనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఉచితంగా వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభించారు. 200 మందికి వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, అర్బన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉబేదుల్లా, మెడికల్ ఆఫీసర్ సుమధుర తదితరులు పాల్గొన్నారు.

మాతృత్వ శిశుమరణాలను అరికట్టండి

ఖాజీపేట: మాతృత్వ శిశుమరణాలను అరికట్టడమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.నాగరాజు వైద్య సిబ్బందికి సూచించారు. ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ అభయాన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గర్భిణులకు అందే వైద్యంపై ఆరా తీశారు. గ్రామాల్లో పర్యటనా వివరాలను వైద్య సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. హెల్త్ క్లినిక్‌లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ఎస్ ముబీన్,ఎంపీహెచ్‌ఓ ప్రసాద్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణంతో పాటు స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

కడపలో నేడు 'మేమంతా సిద్ధం' సభ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

విజయవంతానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపు

కడప కార్పొరేషన్: కడప అసెంబ్లీ నియోజకవర్గంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న 'మేమంతా సిద్ధం' బహిరంగ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు.గురువారం స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు మూడు రోజులు మాత్రమే సమయం ఉందని, ఈ మూడు రోజులు శ్రమపడితే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. ఏమాత్రం పొరపాటు జరిగినా చాలా నష్టం జరుగుతుందని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడప అసెంబ్లీ నియోజకవర్గ సభలో పాల్గొనేందుకు ఈనెల 10వ తేది కడపకు రానున్నారన్నారు. వన్‌టౌన్–గోకుల్ సర్కిల్‌లో జరిగే ఈ సభను పార్టీ నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలన్నారు. ప్రతి డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో జన సమీకరణ చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో కులమతాలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయన్నారు. ముఖ్యంగా దళిత, గిరిజన, బహుజన, మైనార్టీ వర్గాలకు అత్యధికంగా మేలు జరిగిందన్నారు. ఈ విషయాన్ని ఆయా వర్గాల ప్రజలకు చేరవేసి చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్‌బాషా, పి. జయచంద్రారెడ్డి, పులి సునీల్, కరిముల్లా, నజీర్ అహ్మద్, బండి జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

పోలీసు అధికారులకు ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ దిశానిర్దేశం

కడప అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం కడప నగరంలో పర్యటించనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. కడప నగరంలో ముఖ్యమంత్రి నిర్వహించనున్న సభాస్థలిని గురువారం ఎస్పీ పరిశీలించారు. హెలీప్యాడ్, సెవెన్‌రోడ్స్ కూడలి, టవర్‌క్లాక్ ప్రాంతాలను పరిశీలించి ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ దిశానిర్దేశం చేశారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని సిబ్బందికి ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఇతర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కడపలో సీఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

నేడు పెన్షన్ అదాలత్

కడప కల్చరల్: ఈపీఎస్–1995 పెన్షనర్లు, సభ్యుల కోసం ప్రత్యేకంగా ఈపీఎస్ నిబంధనల గురించి వివరించేందుకు, సమస్యలను పరిష్కరించుకునేందుకు పెన్షన్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్–2 గౌరవ్ మహల్వాల్ తెలిపారు. పెన్షనర్లు, సభ్యులు తమ సమస్యలను పరిష్కరించుకోవడంతోపాటు ఈపీఎఫ్ అధికారులతో సంబంధాలు మెరుగు పరుచుకునేందుకు కూడా ఈ వేదిక ఎంతో ఉపయోగపడగలదన్నారు. పెన్షన్ అదాలత్ ఈనెల 10న ఉదయం 11 గంటలకు వెబెక్స్ వేదికగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. పెన్షనర్లు రాబోయే మూడు నెలల్లో తమ ఫిర్యాదులతో పెన్షన్ అదాలత్‌కు హాజరుకావచ్చని వివరించారు. పూర్తి వివరాలకు కడప నగరంలోని ఎర్రముక్కపల్లెలోగల తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

11న రాహుల్ గాంధీ రాక

కడప వైఎస్ఆర్ సర్కిల్: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ ఈ నెల 11న జిల్లా కేంద్రమైన కడపకు రానున్నారు. స్థానిక డీసీసీ కార్యాలయంలో ఆ పార్టీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి అఫ్జల్‌ఖాన్, నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి ఈ విషయాన్ని గురువారం విలేకరులకు తెలిపారు. పర్యటనను విజయవంతం చేయాలన్నారు. కాగా, రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో నగరంలోని పుత్తా ఎస్టేట్‌లో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

11న బాస్కెట్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని జయనగర్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 11వ తేదీ ఉదయం 7.30 గంటలకు బాలబాలికలకు జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.సహదేవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2008 జనవరి 1 తర్వాత పుట్టినవారు ఎంపికలకు అర్హులన్నారు. ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించనున్న యూత్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు.

న్యాయ సంబంధిత సేవలపై అవగాహన



పారాలీగల్ వాలంటీర్లతో మాట్లాడుతున్న జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్

కడప అర్బన్ : న్యాయ సంబంధిత సేవలపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ అన్నారు. కడపలోని జిల్లా కోర్టు ఆవరణలోని 'న్యాయసేవాసదన్'లో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, లీగల్ ఎయిడ్ క్లినిక్స్, పారా లీగల్ వాలంటీర్ల విధి విధానాలు, పబ్లిక్ యుటిలిటీ, తదితర సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య



మృతుడు మహబూబ్‌బాషా

జమ్మలమడుగు రూరల్ : కుట్టు మిషన్ మెకానిజంలో శిక్షణ పొందుతున్న ఎక్కలూర్ మహబూబ్‌బాషా(20 ఓ షాప్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండలంలోని దేవగుడి గ్రామానికి చెందిన ఎక్కలూర్ మహబూబ్‌బాషా జమ్మలమడుగు పట్టణం కాపు వీధిలోని ఓ షాప్‌లో కుట్టు మిషన్ మెకానిజంలో శిక్షణ పొందుతున్నాడు. బుధ వారం సాయంత్రం ఇంట్లో చెప్పి షాప్‌కు వెళ్లాడు. గురువారం ఉదయం షాప్ యజమాని దుకాణం తెరచి చూడగా పైన కొక్కీకి ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి షబ్బీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసలు

కమలాపురం : కమలాపురం పట్టణంలోని 11వ కౌన్సిల్ వార్డులో యోగీశ్వర్, ఆరిఫ్ బాషా, అల్తాఫ్, మహ్మద్, జాకీర్ తదితర 15 మంది యువకులు, జంగంపల్లెలో జనార్థన్‌తో సహా 50 కుటుంబాలు, అప్పారావుపల్లెలో పాలతల రవితో సహా 50 కుటుంబాలు నియోజకవర్గ నాయకుడు సాయినాథ్ శర్మ ఆధ్వర్యంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన పవన్, అజయ్, ప్రేమ్, దిలీప్, కౌసిక్, మౌలాలి తదితర 25 కుటుంబాలు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీకు లబ్ధిదారులకు సొమ్ము అందకుండా చంద్రబాబు అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, క్రిష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జయసుబ్బారెడ్డి, మధుసూధన్ రెడ్డి, వెంకటేష్, దేవదానం, తదితరులు పాల్గొన్నారు.

అరుంధతీ నగర్‌లో 30 కుటుంబాలు

మైదుకూరు : పట్టణంలోని అరుంధతీ నగర్‌కు చెందిన 30 కుటుంబాల వాసులు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక 22వ వార్డు పరిధిలోని అరుంధతీ నగర్‌కు చెందిన గద్దె విష్ణు, గద్దె దివాకర్, చెరుకూరి బాలాజీ, చెరుకూరి రాముడు, ఆళ్లగడ్డ అశోక్, గద్దె కుమారి, ఆళ్లగడ్డ వేలంగినమ్మ, బాలుగాళ్ల ఓబయ్య తదితర 30 కుటుంబాల వారికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి, సొద్దల గురప్ప, వెంకటసుబ్బన్న, సొద్దల సురేష్, రాందాసు, సుబ్బరామిరెడ్డి, కిరణ్మయి, ఎంఆర్ఎఫ్.సుబ్బయ్య, తప్పెట పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 20 కుటుంబాలు

చెన్నూరు : చెన్నూరు మండలం కొండపేట గ్రామానికి చెందిన దామిశెట్టి శేషయ్య, జీసీ.సుబ్బరాయుడు, జింకాఅబ్బన్న, దనిరెడ్డి లింగారెడ్డి, మిడిమినేని వెంకటసుబ్బన్న, జింకా చలపతి, భాష, ఖాజాపీర్, అల్లా ప్రకాష్ తదితర 20 కుటుంబాలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వంద శాతం హామీలు నెరవేర్చారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరిస్తే మరో 40 ఏళ్ల పాటు సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఉంటారన్నారు. ప్రతి కార్యకర్త రాబోయే నాలుగు రోజులు కష్టపడితే విజయం తమదేనని ధీమా వ్యక్తం చేశారు. ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మండల కన్వీనర్ జి.ఎన్.భాస్కర్‌రెడ్డి, అల్లి శ్రీరామమూర్తి, ముదిరెడ్డి రవీంద్రారెడ్డి, ఆర్ఎస్ఆర్, రఘురాంరెడ్డి, ఎర్రసాని మోహన్‌రెడ్డి, పుల్లారెడ్డి, నిత్య పూజ, అన్వర్ భాష, సాదిక్ అలీ, అబ్దుల్ రబ్, వారిస్, అభిమానులు పాల్గొన్నారు.



జంగంపల్లెలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, సాయినాథ శర్మ



11వ వార్డులో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, సాయినాథశర్మ



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

జీవితఖైదీ మృతి ఘటనలో ఇద్దరి సస్పెన్షన్

కడప అర్బన్ : కడప కేంద్ర కారాగారం ఆవరణలో డైరీ షెడ్ వద్ద చెట్టు ఎక్కి కొమ్మలను తొలగించే క్రమంలో ఉప్పర రంగయ్య అలియాస్ పూజారి (48) అనే జీవిత ఖైదీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఖైదీలతో పనిచేయించే క్రమంలో నిర్లక్ష్యం వహించారని భావించి డిప్యూటీ జైలర్ ఎస్.నారాయణరెడ్డి, హెడ్ వార్డర్ ఎస్.కొండారెడ్డిలను సస్పెండ్ చేస్తూ కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ఐఎస్‌హెచ్ ప్రకాష్ ఉత్తర్వులు ఇచ్చారు.

అనుమానాస్పదంగా ఒకరు మృతి



మృతి చెందిన జడల హరి

వల్లూరు : మండలంలోని పుల్లారెడ్డిపేట ఎస్సీ కాలనీకి చెందిన జడల హరి(30) గురువారం మృతి చెందగా, అనుమానాస్పద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జడల హరి బుదవారం రాత్రి మృతి చెందగా, బంధువులు గురువారం అంత్యక్రియలు నిర్వహించడానికి సిద్ధమయ్యారు. ఇంట్లో గొడవల కారణంగా హరి ఉరి వేసుకుని మృతి చెందినట్లు ఎవరో సమాచారం ఇవ్వడంతో పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కడప రిమ్స్ ఆసపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నెర్రవాడలో టీడీపీకి షాక్..!





చాపాడు : నెర్రవాడలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు, వైఎస్సార్‌సీపీలో చేరిన కోటవీధి ముస్లింలు

చాపాడు : మండలంలోని నెర్రవాడ గ్రామంలో గురువారం సాయంత్రం టీడీపీకి బిగ్ షాక్ తగిలింది. మైదుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సామాజిక వర్గానికి చెందిన నెర్రవాడ వాసులు చల్లా గంగయ్య, గంగాధర్, చిన్నగంగన్న, వెంకట రమణ, గంగయ్య, పిట్టి కాశీ విశ్వనాథ్, నరసింహులు, తదితరులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా సుధాకర్ యాదవ్‌కు 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసినా, తమకు ఏ విధంగా ఉపయోగపడలేదని, కనీసం అందుబాటులో ఉండరని తెలిపారు. దీంతో తాము వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్షుమయ్య, జెడ్పీటీసీ శాంతురాజు, బాలనరసింహారెడ్డి, ప్రకాశ్, రామసుబ్బారెడ్డి, ఓబుళరెడ్డి, నరసింహారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, జయరామిరెడ్డి, సీపీ.సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఓబులేసు, రామచంద్రారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రమణయ్య, ప్రసాద్, మనోహర్, బండి పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో ముస్లింలు..

జమ్మలమడుగు : పట్టణంలోని కోటవీధి ప్రాంతానికి చెందిన ముస్లింలు మంటి ఆరిఫ్, ఆసిఫ్, జలీల్ ,రఫి, ఫారుక్ గౌస్, జాఫర్ తదితరులు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, హజ్ కమిటి చైర్మన్ గౌస్‌లాజం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముస్లింలలో వెనుకబాటుతనాన్ని గుర్తించి నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పిస్తే కూటమి నాయకులు తొలగించేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు ఫయాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మామపై కొడవలితో అల్లుడు దాడి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని లక్కిరెడ్డిపల్లె మూడు రోడ్ల కూడలిలో మామ కృష్ణయ్యపై కొడవలితో అల్లుడు రాఘవ దాడి చేయడంతో గాయాలయ్యాయి. సీఐ జీవన్ గంగనాథ బాబు కథనం మేరకు.. రామాపురం మండల, అగ్రహారం గ్రామానికి చెందిన కృష్ణయ్య కుమార్తెకు పాలెం హరిజనవాడకు చెందిన రాఘవతో మూడు నెలల క్రిందట వివాహం జరిగింది. కొంతకాలంగా భార్య భర్తలు అన్యోన్యంగా ఉన్నా.. ఇటీవల తన కుమార్తెను రాఘవ ఇబ్బందులు పెడుతున్నట్లు తెలుసుకున్నాడు. లక్కిరెడిపల్లిలోని అల్లుడి ఇంటికి వెళ్లి ఘర్షణ పడ్డాడు. ఆ సమయంలో ఇంట్లో లేని అల్లుడు రాఘవ అనంతరం విషయం తెలుసుకుని మామ కృష్ణయ్యపై కొడవలితో దాడి చేశాడు. కాలికి గాయాలవడంతో అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తన తండ్రి, చెల్లెలిపై దాడి చేశారని అల్లుడు రాఘవ ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


నిప్పంటించుకుని యువకుడి ఆత్మహత్య

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు గ్రామానికి చెందిన యువకుడు సుబ్బనరసయ్య(25) పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. చిన్నఓరంపాడు పంచాయతీ భద్రావతి నగర్‌కు చెందిన సుబ్బనరసయ్య గురువారం చిన్నఓరంపాడు జడ్పీ పాఠశాల భవనంపైకి వెళ్లాడు. అక్కడే పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. శరీరం కాలిపోవడంతో మంటలకు తట్టుకోలేక అక్కడి నుండి క్రిందకు దూకి మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మడితొట్టి రామయ్యకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు.

వైభవం.. చెన్నకేశవుడి చందనోత్సవం



చందనోత్సవ అలంకార భూషితుడైన చెన్నకేశవుడు



చందనాలంకారంలో కామాక్షీ అమ్మవారు



హనుమద్వాహనంపై చెన్నకేశవస్వామి

వల్లూరు : పుష్పగిరిలోని కొండపై వెలసిన లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో మూల విరాట్‌కు గురువారం చందనోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చందనంతో ప్రత్యేకంగా అలంకరించారు. చందన భూషితుడై తేజోవంతంగా కనిపిస్తున్న స్వామిని దర్శించుకుని భక్తులు తరించారు. కామాక్షీ వైద్యనాథేశ్వర ఆలయంలో అర్చకులు శ్రీనివాసమూర్తి స్వామిని అభిషేకించి, కామాక్షీదేవి అమ్మ వారికి చందనోత్సవం నిర్వహించారు. రాత్రి పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీ స్వామి ఆధ్వర్యంలో నెమలి వాహనంపై స్వామిని కొలువుదీర్చి వైద్యనాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలతో స్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం చెన్నకేశవస్వామి హనుమద్వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. కొండపై నుంచి స్వామిని పల్లకిలో మోస్తూ మంగళ వాయిద్యాలు, దివిటీల వెలుగుల మధ్య పుష్పగిరి మాడ వీధులలో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పుష్పగిరిలో నేడు అక్షయ తదియ

బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం అతి ముఖ్యమైన అక్షయ తదియ ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. రాష్ట్రం నలమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. ఉదయం చెన్న కేశవుడికి పూలంగి సేవ జరుగుతుంది. రాత్రి జరిగే వైద్యనాథుడి నందివాహన సేవకు, శ్రీ చెన్న కేశవుని గరుడ వాహన సేవకు విశేష సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారు.

తిరుణాలకు ఏర్పాట్లు పూర్తి

భక్తులు భారీగా తరలి రానున్న నేపథ్యంలో నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పెన్నా నది ఎండిపోవడంతో ఫిల్టర్ వేసి భక్తుల స్నానాలకోసం పైపులు ఏర్పాటు చేశారు. మహిళలు బట్టలు మార్చుకోవడానికి తాత్కాలిక గదులు ఏర్పాటు చేశారు.

ట్యాంకర్ ఢీకొని ఇద్దరి దుర్మరణం

మదనపల్లె : సొంత పనులపై ద్విచక్ర వాహనంలో వస్తున్న ఇద్దరు వ్యక్తులను నీళ్ల ట్యాంకర్ ఢీకొనడంతో దుర్మరణం పాలయ్యారు. రెండు కుటుంబాల్లో తీవ్ర విషాద ఛాయలు నింపిన ఈ సంఘటన గురువారం మదనపల్లె పట్టణంలో జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండలం దొడ్డికాడపల్లికి చెందిన రామచంద్రారెడ్డి, సరస్వతమ్మ దంపతుల కుమారుడు ఉత్తన్న గారి గణపతి రెడ్డి(38), మదనపల్లి పట్టణంలోని శ్రీవారినగర్‌లో నివాసముంటూ చౌడేశ్వరి కళ్యాణమండపం సమీపంలో బాలాజీ టైల్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం శ్రీవారినగర్‌కు చెందిన నారాయణప్ప, నారాయణమ్మ దంపతుల కుమారుడు ఎం.మంజునాథ్ (30)తో కలిసి ద్విచక్ర వాహనంలో మదనపల్లె పట్టణంలోకి బయలుదేరారు. టమోటా మార్కెట్ యార్డు సమీపంలో వెనక నుంచి వచ్చిన ప్రైవేటు నీళ్ల ట్యాంకర్ డ్రైవర్ మద్యం మత్తులో వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. గాయపడిన గణపతి రెడ్డి, మంజునాథ్‌లను నీళ్ల ట్యాంకర్‌తో ఈడ్చుకుంటూ మార్కెట్ గేట్ వరకు వెళ్లాడు. క్షతగాత్రులను స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్య సేవలు అందిస్తుండగానే ఇరువురూ మృతి చెందారు. గణపతిరెడ్డికి భార్య నాగవేణి, కుమార్తెలు ప్రణీత రెడ్డి(07), గమ్యశ్రీ (05) ఉన్నారు. జిల్లా ఆస్పత్రిలో ఇరు కుటుంబాల బంధువులు స్నేహితుల రాకతో విషాదఛాయలు అలముకున్నాయి. మద్యం మత్తులో ఉన్న నీళ్ల ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే గణపతి రెడ్డి, మంజునాథ్ మృతిచెందారనే ఆగ్రహంతో స్థానికులు అతడిని చితకబాదారు. పోలీసులు చేరుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.